సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



క్రీడాకారులతో ఆటలా..?

బుధవారం విజయవాడలో పలు పోటీలు జరగనున్నాయి. సమాచారం మాత్రం మంగళవారం సాయంత్రం ఇచ్చారు. - 8లో



అనుమానాస్పద మృతి

వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందారు. సంతవురిటిలో ఘటన జరిగింది. - 8లో

19న జాబ్‌మేళా

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో ఫాక్స్‌కాన్, బ్లూస్టార్, టాటా టోయే రేడియేటర్స్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, డెక్కన్ కెమికల్స్, సోలార్ ప్యానెల్ తదితర కంపెనీలు హాజరు కానున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి ఆ పైన చదువుకున్న అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జి అండర్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ జి.పద్మారావు మంగళవారం తెలిపారు. ఫీజుల స్వీకరణ మే 15వ తేదీ వరకు ఉంటుందని అన్నారు. పరీక్షలు మే 26వ తేదీ నుంచి నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు.

పోర్టు రైల్వే లైను పరిశీలన



రైల్వే లైన్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి, పోర్టు జీఎం శంకర్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు రైల్వే లైన్ కోసం సేకరించిన భూములను కూర్మనాథపురం వద్ద టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. రైల్వే లైను పనులు వేగవంతం చేయాలని పోర్టు అధికారులకు సూచించారు. మార్కెట్ వ్యాల్యూ ప్రకారం తన భూమికి పరిహారం ఇవ్వలేదని గ్రామానికి చెందిన కోట రామ్మూర్తి ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందరికీ ఒకేలా పరిహారం ఇవ్వడం జరిగిందని ఆర్డీఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు జీఎం శంకర్, డిప్యూటీ తహసీల్దార్ హరి ఉన్నారు.

912 పంచాయతీల్లో 857 చలివేంద్రాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని 912 పంచాయతీల్లో 857 చలివేంద్రాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 137 ప్రభుత్వ శాఖలు, 693 స్థానిక సంస్థలు, 27 స్వచ్ఛంద సంస్థలు, ఇతరుల ద్వారా ఇవి ఏర్పాటు చేస్తున్నారు. మానిటరింగ్ అధికారులను ప్రతి మండలానికి నియమించి పర్యవేక్షిస్తారు.

గొప్పిలిలో మరో చెక్‌పోస్టుకు యోచన

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో అంతర్రాష్ట్ర నేరస్తులు చొరబడుతున్నారన్న విషయంపై ప్రత్యేకంగా నిఘా పెడుతున్నామని, ఇప్పటికే కొన్ని బృందాలు పనిచేస్తున్నాయని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పత్రికా విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గంజాయి, చోరీలు ఇతరత్రా నేరాల్లో వరుసగా ఒడిశా, వెస్ట్‌బెంగాల్, ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్ తెలంగాణ వంటి రాష్ట్రాల వారిని పట్టుకుంటున్నామని, అన్నింటికీ బోర్డర్‌గా జిల్లా ఉండటమే కారణమని అన్నారు. ఇప్పటికే పర్లాఖిమిడి, పాతపట్నం, ఇచ్ఛాపురం చెక్‌పోస్టులున్నాయని, గొప్పిలిలో మరో చెక్‌పోస్టును పెట్టే యోచనలో ఉన్నామన్నారు. అంతర్రాష్ట్ర నేరగాళ్లపై బీట్‌సిస్టమ్, అనుమానితులపై సర్వేలైన్స్ పెట్టామని, ఫింగర్‌ప్రింట్ తనిఖీ చేస్తుంటామన్నారు. అంతేకాక అంతర్రాష్ట్ర అధికారులతో అక్కడి నేరస్తుల ఫింగర్‌ప్రింట్ డీటైల్స్ కమ్యూనికేషన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 80 శాతం గ్రేవ్ కేసులు తగ్గాయని, చిన్న చిన్న నేరాలు మూడు శాతం పెరిగాయన్నారు.

ఒంటరి మహిళ పింఛన్ నిలిపివేత

నరసన్నపేట: 'మా పార్టీకి అనుకూలంగా ఉండటం లేదు. మాకు వ్యతిరేకంగా పనిచేస్తున్నావు. మా ప్రభుత్వంలో నీకు ఎందుకు పింఛన్ ఇస్తాం. నువ్వు మా పార్టీకి అనుకూలంగా ఉంటేనే పింఛను ఇప్పిస్తాం' అంటూ మండలంలోని రావులవలసకు చెందిన టీడీపీ నాయకుడు వెలమల శకుంతలకు వస్తున్న ఒంటరి మహిళ పింఛన్‌ను నిలిపివేశారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పింఛన్ డబ్బులు ప్రభుత్వం నుంచి వచ్చినా స్థానికంగా అధికారులకు, సచివాలయ సిబ్బందికి చెప్పించి పింఛన్ పంపిణీ చేయకుండా నిలిపివేయించారు. దీంతో శకుంతల తనకు వచ్చే ఒంటరి మహిళ పింఛన్ పునరుద్ధరించాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శకుంతలకు వ్యతిరేకంగా రావులవలసలో సచివాలయ సిబ్బందితో ఎంక్వైరీ రిపోర్టు కూడా ఒత్తిడి చేసి రాయించినట్లు తెలుస్తోంది. నెల వారీ వచ్చే పింఛన్ రాకపోవడంతో శకుంతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫింఛన్ ఇవ్వాలని మంగళవారం మరో మారు స్థానిక ఎంపీడీఓ మధుసూదనరావుకు వినతి పత్రం అందజేశారు.



ఎంపీడీఓకు విజ్ఞాపన పత్రమిస్తున్న శకుంతల





ఉపాధి.. ఆశలకు సమాధి

ఈ రోడ్డు చూడండి. మెళియాపుట్టి మండలంలోని దీనబంధుపురం పంచాయతీ చింతలకోలూరు నుంచి అచ్చనాపురం వరకు ఐదు బిట్లు కింద రూ.2కోట్ల వ్యయంతో వేసిన రోడ్డు ఇది. మెటల్ వేసి వదిలేశారు. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి.


ఈ రోడ్డు చూడండి. ఇచ్ఛాపురం మండలం ఈదు పురంలో వేసిన రోడ్డు ఇది. ఇప్పటికే ఈ రోడ్డు దారుణంగా ఉందని 'సాక్షి'లో కథనం వచ్చాక ప్యాచ్ వర్క్‌లు చేశారు. అయినప్పటికీ దాని పరిస్థితి అలాగే ఉంది. వర్షం వస్తే ఆ రోడ్డు దుస్థితి మళ్లీ మొదటికొస్తుంది.



- ఉపాధి హామీ పథకానికి గడ్డు కాలం
- వేతనాల్లేక కూలీల ఆకలి కేకలు
- మూడు నెలలుగా రూ.85 కోట్ల మేర వేతనాలు చెల్లించని వైనం
- పల్లె పండగకు ఫైనల్లేక పనుల నిలిపివేత
- రూ.200 కోట్ల మేర బకాయిలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఉపాధి హామీ పథకానికి గడ్డు కాలం నడుస్తోంది. ఫలితంగా పల్లె పండుగ కాగితాలకు పరిమితమైపోయింది. మూడు నెలలుగా కూలీలకు వేతన బకాయిలు చెల్లించడం లేదు. వేతనాలే కాదు పల్లె పండగ పేరుతో చేపట్టిన అభివృద్ధి పనులకు కూడా నిధులు విడుదల చేయలేదు. బిల్లులు రాకపోవడంతో ఆ పనులు చేస్తున్న వెండర్స్ అదే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉమ్మ తడి పనులు చేస్తున్నారు. దీంతో సంక్రాంతికి పూర్తి కావాల్సిన పల్లె పండగ పనులు మరో ఏడాది గడిచినా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చేసిన హడావుడి, ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. అధికారంలోకి రాగానే పల్లె పండగ పేరుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. సంక్రాంతి కల్లా పల్లెల రోడ్లన్నీ ఒక్కసారిగా మారిపోతాయన్న బిల్డప్ ఇచ్చారు. కానీ, పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇప్పటికే వేసిన రోడ్లు కూడా నాసిరకంగా ఉన్నాయి. నాలుగైదు నెలల్లో వర్షాలు పడితే వచ్చే సంవత్సరం మళ్లీ అవే రోడ్లు పునర్నిర్మాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



కూలీల ఆకలి కేకలు..

మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనులకే కాదు ఉపాధి హామీ పథకం కింద చెరువు తదితర పనులు చేస్తున్న కూలీలకు కూడా వేతనాలు చెల్లించలేదు. గత మూడు నెలలుగా చెల్లింపులు చేయకపోవడంతో కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 2లక్షల మంది కూలీలకు రూ.85కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉంది. మూడు నెలలుగా చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో కూలీల వేదన చెప్పనక్కర్లేదు.

నిధుల సమస్య.. వెండర్స్ కక్కుర్తి

పల్లెలో పంచాయతీ సర్పంచ్‌ల ద్వారా జరగాల్సిన ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులను వెండర్స్ పేరుతో టీడీపీ నాయకులకు అప్పగించారు. ఇంకేముంది దాహంతో ఉన్న పచ్చనేతలు ఉపాధి పనులను క్యాష్ చేసుకున్నారు. ఇష్టారీతిన, పద్ధతి లేకుండా కొన్ని చోట్ల రోడ్లు వేశారు. మరికొన్నిచోట్ల మధ్యలో వదిలేశారు. దీనికంతటికీ నిధుల సమస్య ఒకటైతే... నాయకుల కాసుల కక్కుర్తి మరో కారణంగా చెప్పవచ్చు. పల్లె పండగ కింద జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద 6300 పనులు మంజూరు చేశారు. వాటిలో 4 వేల పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో 2400 పనుల వరకు పూర్తయ్యాయి. మరో 1600 పనులు ప్రారంభ దశ నుంచి మధ్యలో ఉన్నాయి. పూర్తయిన, ప్రగతిలో ఉన్న పనులకు రూ. 293కోట్లు ఖర్చు కాగా ప్రభుత్వం కేవలం రూ.93కోట్లు మాత్రమే విడుదల చేసింది. గత ఏడాది డిసెంబర్ నుంచి నిధులు నిలిపివేసింది. దీంతో మూడు నెలలుగా పల్లె పండగ పనులకు నిధులు విడుదల కాని దుస్థితి చోటు చేసుకుంది. దీంతో కొందరు హడావుడిగా నాసిరకం పనులు చేపట్టగా, మరికొందరు అరకొర పనులు చేసి వదిలేశారు.

నిధులు విడుదల కావాల్సిన వాటిలో పవన్ కల్యాణ్ శాఖకు చెందిన పంచాయతీరాజ్ పరిధికి సంబంధించి రూ.156కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మెటల్ రోడ్లు, సీసీ డ్రైన్లు, కాంపౌండ్ వాల్స్ ఉన్నాయి. అలాగే, ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి రూ.18కోట్లు, సర్వశిక్షా అభియాన్‌కు సంబంధించి రూ.7కోట్లు, ఆర్‌అండ్‌బీకి సంబంధించి రూ.10కోట్లు, ఎంసీసీ పనులకు సంబంధించి(గోకులాలు, పశువుల నీటి తొట్టెలు) రూ. 30కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వస్తేనే తినేసి వెండర్స్ ఉండగా, నిధులు రాకపోతే ఆ పనులు ఎలా చేస్తారో అర్థం చేసుకోవచ్చు. పల్లె పండగ పనులన్నీ ఇప్పుడలానే ఉన్నాయి.

వెండర్స్ వెర్సెస్ అధికారులు

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో డ్వామా అధికారుల పరిస్థితి అయోమయంగా తయారైంది. చేసిన పనికి వేతనాలు చెల్లించాలంటూ ఒకవైపు కూలీలు నిలదీస్తుండగా, మరోవైపు వెండర్స్ కూడా గట్టిగానే సతాయిస్తున్నారు. పనులు చేయించుకుని మోసం చేశారంటూ డ్వామా అధికారులకు ఫోన్ చేసి మండిపడుతున్నారు. ఈ క్రమంలో హ్యాపీ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ పేరుతో గోకులాలు నిర్మించిన ఓ వెండర్ తాజాగా డ్వామా పీడీ సుధాకర్‌కు ఫోన్ చేసి గట్టిగా అడిగారు. ఆయన అడగడంలో అర్థం ఉన్నప్పటికీ అడిగే తీరులో తేడా ఉండటంతో పీడీ కూడా ధీటుగా స్పందించారు. ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగింది. మోసం చేశారనే పదం వెండర్ నుంచి రావడంతో పీడీ కాసింత సీరియస్ అయ్యారు. పై నుంచి నిధులు వస్తే మీ ఖాతాలో పడతాయని.. ఇందులో మా పాత్ర ఏముంటుందని పీడీ అనగా, నిధులు ఇస్తామంటేనే పనులు మొదలు పెట్టామని వెండర్ బదులిచ్చారు. మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఇప్పుడా ఫోన్ సంభాషణ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది. ఇదే విషయమై డ్వామా పీడీ సుధాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా త్వరలోనే నిధులొచ్చేస్తాయని, అంతవరకు వెండర్స్ ఓపిక పట్టాలని, వేతనదారులకు కూడా కేంద్రం నుంచి రాగానే చెల్లింపులు జరిగిపోతాయని చెప్పారు.

మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ



శ్రీకాకుళం పాతబస్టాండ్: మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణను అందిస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు ఇంగ్లిష్ మీడియంలలో అందుబాటులో ఉండే ఈ శిక్షణకు టెట్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జాబితా, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (రూ. 2 లక్షల లోపు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో శ్రీకాకుళం పట్టణంలోని 80 ఫీట్ రోడ్, టీడీపీ భవనం వెనుక ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించగలరని సూచించారు.

బడిఈడు పిల్లల గుర్తింపు: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

టెక్కలి: కొత్త విద్యా సంవత్సరం తరగతులు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే విధంగా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి సంబంధించి ఇప్పటికే 10వ తేదీ నుంచి 20 వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బడి ఈడు పిల్లల గుర్తింపు చేపడుతున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య వెల్లడించారు. ఆయన మంగళవారం టెక్కలి మండల విద్యాశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గత ఏడాది విద్యా సంవత్సరంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 2,44,869 మంది విద్యార్థులు ఉండేవారని, ఇప్పుడు 2,50,000 మంది విద్యార్థులు చేరే వి ధంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయ న వెల్లడించారు. జూన్ 12 పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెలాఖరులోగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని డీఈఓ తెలిపారు. అలాగే ఈనెల 21 నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. 60 మంది విద్యార్థులు దాటి మూడు కి లోమీటర్ల పరిధిలో ఎలాంటి ఉన్నత పాఠశాల లేకపోతే ఆయా ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలగా గుర్తిస్తామని డీఈఓ తిరుమల చైతన్య పేర్కొన్నారు. తరగతుల విలీనం విషయంలో ఆయా గ్రామాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల ఆమోదం ఉంటేనే విలీనం చేస్తామని స్పష్టం చేశారు.

లారీపై వస్తారు.. చోరీ చేసి పోతారు..





- అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్టు చేసిన పోలీసులు
- 140 దొంగతనాలకు పాల్పడిన ముఠా
- రికవరీలో కనిపించిన గిల్టు నగలు
- ఫిర్యాదులో అసలైన నగలని పేర్కొన్న బాధితులు
- తప్పుడు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి. చిత్రంలో రికవరీ చేసిన వస్తువులు

శ్రీకాకుళం క్రైమ్ : తొమ్మిది తులాల బంగారం పోయిందని ఫిర్యాదు చేశారు.. తీరా చూస్తే అవన్నీ గిల్టు. పది కిలోల వెండి పోయిందని మరొకరు ఫిర్యాదు చేశారు.. రికవరీ చేస్తే అవి మూడు కిలో లే. ఈ గిల్టు నగలను దొంగిలించింది మాత్రం ఓ అంతర్రాష్ట్ర ముఠా. 140 ఇళ్లకు కన్నాలు వేసి 32 కేసుల్లో నిందితులైన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగ లు ఈ నకిలీ నగలను చోరీ చేశారు. వీరిని పోలీసులు పట్టుకున్నారు. వీరిలో ఏ–1 నిందితుడైన నూర్‌హసన్(43)ది ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ కాగా, మిగతా ఇద్దరు చత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన ఇర్ఫాన్ అహ్మద్ (32), అబ్దుల్ గఫూర్(59)లు. జిల్లాలో వీరు 14 చోట్ల చోరీలు చేయగా హిమాచల్ ప్రదేశ్(07), రాజస్థాన్ (09), ఒడిశా (02) వంటి ఇతర రాష్ట్రాల్లో 18 కేసుల్లో నిందితు లు కావడం విశేషం. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

వారి చరిత్ర చూస్తే..

ఏ–1 అయిన నూర్ హసన్ 2001 నుంచే నేరాలు చేయడం మొదలుపెట్టాడు. ఓ కేసులో అరెస్టై డెహ్రాడూన్ జైలుకు వెళ్లగా అక్కడ అంతర్రాష్ట్ర ముఠా నాయకుడైన షేర్ మహ్మద్ పరిచయమయ్యాడు. 18 మంది ఉన్న అతని గ్యాంగులో చేరిపోయాడు. వారితో కలసి 140 దొంగతనాలకు పాల్పడి 32 కేసుల్లో అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నాడు. రాజస్థాన్, జోథ్‌పూర్‌లలో తన గ్యాంగుతో కలసి నేరాలు చేయగా వారు పట్టుబడినా హసన్ తప్పించుకున్నాడు. ఈ క్రమంలోనే రాయపూర్ జైలులో పరిచయమైన ఇర్ఫాన్ అహ్మద్, అబ్దుల్ గఫూర్‌లను తనతో కలుపుకున్నాడు. అబ్దుల్ గఫూర్ సొంత లారీలో హసన్, ఇర్ఫాన్‌లు సరకులు ఇతర రాష్ట్రాలకు రవాణా చేసే క్రమంలో చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆరు నేరాలు చేసి 2019లో పోలీసులకు పట్టుబడి 2022లో బెయిల్‌పై విడుదలయ్యారు. మళ్లీ 2003–25 కాలంలో మన రాష్ట్రంలో నేరాలకు సమాయత్తమయ్యారు.

తప్పుడు కేసులు పెడితే.. చర్యలు తప్పవు

ప్రజలు తమ ఇళ్లల్లో బంగారం, వెండి, నగదు తక్కువ మొత్తంలో పోయినా ఎక్కువ మొత్తంలో పోయిందని ఫిర్యాదు చేసినా, గిల్టు నగలను బంగారు నగలని చెప్పినా బీఎన్ఎస్ సెక్షన్లు 212, 217 ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అన్నారు. ప్రజలు కరెక్టుగా చెబితే పోలీసులు సగమే రికవరీ చేస్తారన్న విలేకరుల ప్రశ్నకు నిందితున్ని పట్టుకున్నప్పుడు అతని వద్ద ఎంత ఉంటే అంతే పట్టుకుంటామని, మిగిలినది నిందితుడు బ్యాంకుల్లో, ఇతర ఫైనాన్స్ సంస్థల్లోను, కరిగించి అమ్మేయడం వంటివి ఉంటే వాటిని తర్వాతైనా రికవరీ చేస్తామన్నారు.

చోరీల తీరే ఓ విచిత్రం..

హసన్, అహ్మద్, గఫూర్‌ల చోరీ తీరే ఓ విచిత్రం. కార్తీ నటించిన 'ఖాకీ'లో మాదిరిగా రాయపూర్ నుంచి సరుకులు ఎక్కించుకుని వివిధ రాష్ట్రాల్లో అన్‌లోడ్ చేయడం, మళ్లీ అక్కడి నుంచి వేరే సరుకులు ఎక్కించి రాయపూర్ తేవడం.. సరుకుల లో దు దించి ఎత్తే మధ్య సమయంలోనే ఇళ్లకు కన్నా లు వేయడం వీరి స్పెషాలిటీ. ఈ క్రమంలో మన జిల్లాలోని కాశీబుగ్గకు కందిపప్పు లోడుతో రావ డం తిరిగి వెళ్లేటప్పుడు జీడిపప్పు తీసుకెళ్లడం, వాటితో పాటు చోరీ సొత్తు సైతం పట్టుకుపోవడం వీరికి పరిపాటి. జిల్లాలో వీరు కాశీబుగ్గ పీఎస్ పరిధిలో తొమ్మిది చోరీలు, ఇచ్ఛాపురంలో రెండు, మందస, సోంపేట, వజ్రపుకొత్తూరు పీఎస్‌ల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తంగా 14 చోరీల్లో రూ. 12,93,614ల విలువైన సొత్తు దోచుకెళ్లారు. వీరి నుంచి పోలీసులు రూ. 5,33,530ల విలువైన బంగారం, వెండి, నగదు, వెంట తెచ్చుకున్న లారీ ని స్వాధీనం చేసుకున్నారు. సమావేశం అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. ప్రతిభ కనబర్చిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కాశీబుగ్గ చోరీలతో మళ్లీ బయటపడి..

ఈ ఏడాది కాశీబుగ్గ పీఎస్ పరిధిలో జరిగిన మూడు చోరీలకు సంబంధించి ఎస్పీ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వీవీ అప్పారావు ఆధ్వర్యంలో సీఐ పి.సూర్యనారాయణ దర్యాప్తు ప్రారంభించారు. వీరికి సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, సీసీఎస్ ఎస్ఐ మధుసూదనరావు, ఫింగర్‌ప్రింట్ ఎస్ఐ భరత్ మరికొంతమంది సహకారంతో విచారణ చేయగా ఇక్కడి దొంగలు పని కాదని గ్రహించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కాశీబుగ్గ మొగిలిపాడు వద్ద సీఐ తనిఖీలు చేస్తుండగా గొప్పిలి వైపు నుంచి సిజి04.ఎస్‌క్యూ.5609 నంబరు గల లారీపై ము గ్గురు నిందితులు వస్తూ పట్టుబడ్డారు. వారిని విచారించగా అసలు విషయాలన్నీ బయటపడ్డాయి. తన ముఠా సభ్యులతో రాజస్థాన్, ఉత్తరాఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఏపీ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో దొంగిలించిన వస్తువులను ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో బంగారు షాపు వర్తకులకు అమ్మినట్లు ఏ–1 నిందితుడు హసన్ ఒప్పుకున్నారు.



చిల్లర వేషాల గణేశా..

'గణపతి.. నేను మల్లేష్‌ను.. గ్రూపులో ఎగ్జిట్ ఎందుకు కొట్టావు.. నువ్వు ఎవడవు.. తీయడానికి....పోస్టులు పెడితే తీసేస్తావా... ఏ ఫొటోలు పెట్టాను.. ఎంపీ, మంత్రి, దాసునాయుడు ఫొటోలు పెట్టాను.. అంతమాత్రాన తీసేస్తావా? పార్టీ గ్రూపులో ఎలా తీస్తావ్. నన్ను తీయడానికి నువ్వెవడివి. పార్టీ కోసం పని చేశాను. నీలా చిల్లర పనులు చేయిలేదు. టిఫిన్ కొట్టోళ్లు, చిల్లర వ్యాపారులు కడుపు కొట్టలేదు.

– నరసన్నపేటకు చెందిన టీడీపీ నాయకుడు మల్లేష్ వాయిస్ ఇది..

మక్కెలిరగ తంతా మల్లేశా!

'నేను అడ్మిన్‌ని గ్రూపులో ఫొటోలు ఇన్నేసి ఫొటోలు పెడితే ఎలా. అందుకే తీసేశాను. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే తంతాను.. ఎవడితో చెప్పుకొంటావో చెప్పుకో.. ఎమ్మెల్యే అవసరం లేనప్పుడు ఎమ్మెల్యే గ్రూపులో నీకు ఉంచం రా.. ఒరే మల్లేసు. ఎక్కువ తక్కువ మాట్లాడితే నరసన్న పేట వస్తే తంతాను. పాతే స్తాను. బోకరువు నువ్వు.. ఎమ్మెల్యే గ్రూపులో నీకు ఉంచనురా.. ఏమి పీక్కొంటావో పీక్కో.. నీకు అంత సీను లేదు. నువ్వు పార్టీకి అవసరం లేదు. నువ్వు అడగడానికి ఎవడివి. నరసన్నపేట రా.. రెండు కాళ్లు పట్టుకొని క్రిందకి తొక్కేస్తా.. బచ్చా గాడవు, నాఇష్టం.. నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. పిచ్చి వేషాలు వేయకు.. నరసన్నపేట రా తంతాను. ఎవడు అడుగుతాడు చూస్తాను..'

– నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రైవేటు పీఏ గణపతి సంభాషణ ఇది

- బగ్గు పీఏ వర్సస్ టీడీపీ నేత
- నోటికొచ్చిన బూతులు తిట్టుకున్న ఇరువురు
- వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టడంతో వివాదం
- నరసన్నపేట నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారిన వ్యవహారం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పీఏ గణపతి, స్థానిక టీడీపీ నాయకుడు మల్లేష్‌ల మధ్య వివాదం రాజుకుంది. ఒకరిపై ఒకరు నోటికొచ్చినట్టు మాట్లాడుకున్నారు. పచ్చిబూతులు తిట్టుకున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ రెచ్చిపోయారు. వారి 'వ్యవహారాలను' వారే బయట పెట్టుకున్నారు. ఇందులో బగ్గు రమణమూర్తి ప్రైవేటు పీఏ గణపతి ఒక అడుగు ముందుకేసి పాతేస్తాను.. తంతాను...అంటూ దర్పాన్ని చూపించగా, టిఫిన్ కొట్లులపై బ్రోకర్ పని చేశావ్. చిన్నోళ్ల కడుపుకొట్టడం... డబ్బులిచ్చినోళ్లకే పనులు చేశావు. నువ్వు చేసేదేంటి? అంటూ టీడీపీ నాయకుడు మల్లేష్ చెలరేగిపోయారు. ఈ ఇద్దరి ఫోన్ సంభాషణ ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీలో చిచ్చు రేపింది. ఇది ఎక్కడికి దారితీస్తుందో చూడాలని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

క్లుప్తంగా

తండ్రీకుమార్తెలపై దాడి



దాడిలో గాయపడిన పిట్ట పాపారావు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర పంచాయతీ గొదలాం గ్రామంలో తండ్రీకుమార్తెలపై దాడి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ట పాపారావు ఆరో తరగతి చదువుతున్న తన కుమార్తె లక్ష్మిప్రియతో కలిసి స్కూటీపై బోరుభద్రలో ఉన్న వివేకానంద పాఠశాలకు బయలుదేరారు. మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన పిట్ట ముఖలింగం ఇనుప రాడ్డుతో వెనుక నుంచి దాడి చేయడంతో పాపారావుతో పాటు కుమార్తె కింద పడిపోయారు. కిందపడిన తండ్రీకుమార్తెలపై ముఖలింగంతో పాటు పిట్ట లక్ష్మణరావు, రామారావులు కర్రలతో దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టారు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకొని బాధితులకు సపర్యలు చేసి 108 అంబులెన్సులో కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిగత, ఆస్తి తగదా వల్లే దాడి జరిగిందని సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి ఎస్‌ఐ సింహాచలం తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో చరణ్‌కు కాంస్యం



చరణ్‌తో కోచ్ పురుషోత్తం

శ్రీకాకుళం న్యూకాలనీ: యూత్ బాక్సింగ్ పోటీల్లో సిక్కోలు కుర్రాడు ఎ.చరణ్‌కుమార్ సత్తాచాటాడు. విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 14 తేదీల్లో జరిగిన 7వ ఏపీ రాష్ట్రస్థాయి యూత్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో లైట్ మిడిల్ వెయిట్ విభాగంలో కాంస్య పతకంతో మెరిశాడు. శ్రీకాకుళంలోని మాస్టర్స్ మైండ్స్ వారియర్స్(ఎంఎండబ్ల్యూ) బాక్సింగ్ క్లబ్‌కు చెందిన ఈ కుర్రాడు కోచ్ కె.పురుషోత్తంరావు పర్యవేక్షణలో ఇటీవల అనేక బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించాడు. తాజాగా కాంస్య పతకం సాధించడం పట్ల బాక్సింగ్‌క్లబ్ అధ్యక్షుడు టి.తారకనాథ్, కార్యదర్శి బి.సురేష్‌కుమార్, కోచ్ పురుషోత్తం, క్లబ్ ప్రతినిధులు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

సన్నధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిందే



పోలాకిలోని ఓ రైస్‌మిల్లులో తనిఖీలు చేపడుతున్న సీఎస్‌డీటీ రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్...

పోలాకి: 'చిన్నబోయిన సన్నాలు' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో పలు మిల్లుల్లో సన్నధాన్యం, బియ్యం, నూకలు తదితర స్టాకులను తనిఖీ చేశారు. వాటా, నిల్వ తదితర అంశాలను తెలియజేసే ఏ, బి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కచ్చితంగా ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా వ్యవసాయశాఖ అధికారులకు సైతం క్షేత్రస్థాయిలో వార్తకు సంబంధించిన అంశంపై ఉన్నతాధికారులు వివరణ కోరినట్లు తెలిసింది. కాగా, రబీకి అందివచ్చిన సన్నధాన్యం ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయడానికి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు లేవని అధికారులు తెలిపారు. ఏదిఏమైనా ప్రభుత్వం ఎగుమతులకు అనుమతిస్తే తప్ప ధాన్యం కొనుగోలులో అనుకున్న స్థాయి మార్కెట్‌ధర పలకదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

ఎన్‌సీడీఆర్‌సీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ)లో ఇద్దరు సభ్యుల ఖాళీల భర్తీకి భారత ప్రభుత్వ వినియోగదారుల శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు రఘుపాత్రుని చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు జడ్జి/పదేళ్ల అనుభవం గల జిల్లా జడ్జి/జిల్లా అదనపు జడ్జి/వ్యాపార న్యాయ ఆర్థిక అకౌంటింగ్ తదితర రంగాలలో 25 ఏళ్ల పైబడి అనుభవము కలిగిన 50 ఏళ్ల పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

రణస్థలం: మండలంలోని నెలివాడ సమీపంలో బీహార్ దాబా వద్ద పాన్‌షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మనోజ్ అనే వ్యక్తిని జె.ఆర్.పురం పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టి 16 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

క్రీడాకారులతో ఆటలా?



కబడ్డీ సాధనలో క్రీడాకారులు

- విజయవాడ వేదికగా నేడు క్రీడా జట్ల ఎంపికలు
- బుధవారం జరిగే ఎంపికలకు మంగళవారం సాయంత్రం మెసేజ్
- శాప్ అధికారులపై మండిపడుతున్న క్రీడాకారులు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కూటమి సర్కారు నిర్లక్ష్యం మరోసారి తేటతెల్లమైంది. అటు పాలకులతోపాటు ఇటు అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పడానికి తాజాగా విడుదలైన క్రీడా ఎంపికల షెడ్యూల్‌ను పరిశీలిస్తే అర్థం చేసుకోవచ్చు. శాప్ అధికారుల తీరుపట్ల క్రీడాసంఘాలు ప్రతినిధులు, క్రీడాకారులు తీవ్రంగా మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..

కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ, స్పోర్ట్స్ ఇండియా ఆధ్వర్యంలో 7వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ త్వరలో ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయి. ఇందులో అండర్–18 బాలుర కబడ్డీ, బాలుర ఖోఖో, బాలికల ఫుట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్ల ఎంపికలను బుధవారం (ఈ నెల 16న) విజయవాడ వేదికగా నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిర్ణయించింది. అంత వరకు బాగానే ఉంది. అయితే ఎంపికలు జరుగుతున్న విషయాన్ని రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చేరవేయడంలో నిర్లిప్తత ధోరణిని ప్రదర్శించారు. కనీసం నాలుగు రోజుల ముందు జిల్లాకు సమాచారాన్ని చేరవేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. జిల్లాల్లో జరిగే జిల్లా స్థాయి ఎంపికలకే రెండు మూడు రోజుల ముందు సమాచారాన్ని పత్రికలు, సోషల్ మీడియా గ్రూపుల్లో క్రీడాకారులకు తెలిసేలా చర్యలు తీసుకుంటారు. అలాంటిది రాష్ట్రస్థాయి ఎంపికలకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై క్రీడాకారులు మండిపడుతున్నారు. క్రీడాకారులు ఎక్కువ మంది వస్తే ఖర్చు అవుతుందనో.. లేదా తక్కువ మంది వస్తే తమవారినే ఎంపిక చేసుకోవచ్చనే కుతంత్రమో.. క్రీడలను పాతరేద్దామనే దుర్బుద్ధో తెలియదుగానీ శ్రీకాకుళం జిల్లాకు సైతం మంగళవారం సాయంత్రం ఎంపికల సమాచారాన్ని చేరవేశారు.

క్రీడాకారుల అవస్థలు

ఆలస్యంగా సమాచారం అందుకున్న నిరుపేద క్రీడాకారులు విజయవాడ పయనమయ్యేందుకు ఆపసోపాలు పడ్డారు. రవాణా చార్జీలకు కూడా ఏర్పాటుచేసుకునే సమయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడాకారులు రాత్రి దొరికిన ట్రైన్లలో రిజర్వేషన్లు లేకుండానే జనరల్ బోగీల్లో పయనమయ్యారు. ఇంకొందమంది ఎక్కువ వ్యయప్రయాసలైనప్పటికీ.. గత్యంతరం లేక ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించారు. మరికొంతమంది ఎంపికలకు వెళ్లలేకపోయారు. శాప్ చైర్మన్‌తోపాటు శాప్ ఉన్నతాధికారులు అనుసరిస్తున్న వైఖరిని ఒలింపిక్ సంఘం, క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు. శాప్ నిర్లక్ష్యం వైఖరితో నష్టపోయిన క్రీడాకారులకు ఎవరు న్యాయం చేస్తారని వారంతా ప్రశ్నిస్తున్నారు.

కొండ దిగితేనే రేషన్



కొండకోనల్లో నివశిస్తున్న గిరిజనులకు రేషన్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో బియ్యం అందుకోవడానికి కొండ దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలాస, మెళియాపుట్టి సరిహద్దు గిరిజన గ్రామాల్లో ఇటువంటి దృశ్యాలు నిత్యకృత్యంగా మారాయి. ఏఐ టెక్నాలజీ విస్తృతమవుతున్న తరుణంలో ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాలకు సెల్ సిగ్నల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – కాశీబుగ్గ

పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పరిపాలనాపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ పరిపాలన, తాగునీటి సరఫరా, ఐసీడీఎస్, గ్రామ సచివాలయాల పనితీరు వంటి కీలక అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు తమ మండల కేంద్రాల్లో, జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ, గృహ స్థలాల పునఃపరిశీలన, ప్రాథమిక గ్రామాల పునః సర్వే, ప్రభుత్వ భూముల వివరాలు, నీటి పన్ను వసూళ్లపై సమీక్ష కొనసాగింది. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ప్రణాళికాధికారి, గ్రామీణ నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరిగా ఉండాలన్నారు. పల్లె పండుగ నేపథ్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో మెటీరియల్ కాంపోనెంట్ వినియోగాన్ని గ్రామ స్థాయి ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్ల వద్దే పర్యవేక్షించాలన్నారు. ప్రధాన మంత్రి సూర్య గృహ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో కొత్త విధానాలను అమలు చేయడంలో ఉద్యోగుల హాజరు, సర్వేలు ముఖ్యమని తెలియజేశారు.

ముగిసిన సదస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న 'విస్మరించబడిన వర్గాలకు సాధికారిత' సదస్సు మంగళవారంతో ముగిసింది. జాతీయ సామాజిక విజ్ఞాన పరిశోధన మండలి – దక్షిణ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మానవ హక్కుల ఫోరం ప్రధాన కార్యదర్శి వి.ఎస్.కృష్ణ, సోషల్ వర్క్ బీవోఎస్ చైర్మన్ పి.అర్జున్, బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షుడు ప్రసాదరావు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల భూముల ఆక్రమణ తగదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

పాతపట్నం: దళిత, గిరిజనుల భూములను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆరోపించారు. మంగళవారం పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు గిరిజనులతో కలిసి ధర్నా నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం మండలం పాశిగంగుపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములను 40 ఏళ్ల క్రితం నక్సలైట్ ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించిన దూసి అప్పలస్వామికి, ఇద్దరు ఆర్మీ ఉద్యోగులకు, మరో ముగ్గురు దళిత, గిరిజన కుటుంబాలకు 4.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూములు పక్కనే ఎమ్మెల్యే స్థలాలు కొనుగోలు కోనుగోలు చేశారని చెప్పారు. ఇప్పుడు పక్కన భూములు కూడా ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయడం తగదన్నారు. అనంతరం డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు, సీపీఐ పాతపట్నం నాయకులు ఆచారి ఆదినారాయణ, త్రినాథ్, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు డి.శారద, బాధిత గిరిజన రైతులు దూసి భాస్కరరావు, ముదిదాన శివ, బిడ్డక భాస్కర్, తాలాడ రావనమ్మ, దుక్క చిన్నావాడు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, గిరిజనులు

పత్రాలు ఉంటే వెనక్కిచ్చేస్తా..

ఈ విషయమై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ ల్యాండ్ సీలింగ్ భూములైతే వెనక్కి ఇచ్చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. 2012లో ఈ భూములు కొనుగోలు చేశానని, అందులో ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నట్టు తనకు తెలియదని చెప్పారు. అమ్మిన వ్యక్తులు చెప్పలేదని, అవి నిజంగా ల్యాండ్ సీలింగ్ భూములైతే, వాటికి సంబంధించి పత్రాలు ఉంటే..ఆ భూములు వారికి ఇచ్చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తనకు భూములు అమ్మిన వారితో వ్యవహారం తేల్చుకుంటానని స్పష్టం చేశారు.

సిక్కోలు కళాకారులకు కందుకూరి పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్/కవిటి/కంచిలి/పలాస:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టి.వి, నాటక రంగ అభివృద్ధి సంస్థ కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కందుకూరి విశిష్ట అవార్డులను ప్రకటించింది. అందులో జిల్లాకు చెందిన ఆరుగురు కళాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 16న విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించబోయే ఈ కార్యక్రమంలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి మెట్ట పోలినాయుడు, గుత్తు చిన్నారావు, బల్లెడ చలపతిరావు, బెండాళం శోభన్‌బాబు, డాక్టర్ కుమార్‌నాయక్, జె.సూర్యప్రకాశరావు మంగళవారం విజయవాడ పయనమై వెళ్లారు.



గుత్తు చిన్నారావు



శ్రీకాకుళం నగర సమీపంలోని బాదుర్లపేటకు చెందిన గుత్తు చిన్నారావుకు చిన్నతనం నుంచి నాటకాల ప్రదర్శనలంటే మక్కువ. అనేక నాటిక ప్రదర్శనలు చేశారు. స్వగ్రామంలో త్రినాథ కళానికేతన్ ఆధ్వర్యంలో మంచి–చెడు, పెంపకం, అగ్నిపథం తదితర నాటకాలలో నటించారు. ఏకపాత్రాభినయాలు, షిరిడీసాయి, బొబ్బిలిరాజు, తదితర పాత్రలు పోషించారు. సుమిత్రా కళాసమితి ద్వారా ఇటీవల కాలంలో చేస్తున్న కళాసేవ చేస్తూ గుర్తింపు పొందారు.

మెట్ట పోలినాయుడు



శ్రీకాకుళం సమీపంలోని ససపలవానిపేటకు చెందిన మెట్ట పోలినాయుడు పంచాయతీరాజ్‌శాఖలో ఇంజినీర్‌గా పనిచేస్తూనే మరోవైపు నాటక రంగం సేవలో అందిస్తున్నారు. తండ్రి, ప్రముఖ రంగస్థల నటులు మెట్ట అప్పారావునాయుడు ఆశయాలను పుణికిపుచ్చుకొని నటనా రంగంలో కొనసాగుతున్నారు. 15 ఏళ్లుగా రచయితగా, నటుడిగా, దర్శకునిగా రాణిస్తున్నారు. అనేక సత్కారాలు, పురస్కారాలు పొందారు. 80కిపైగా నాటికలకు దర్శకత్వం వహించారు. తన గ్రామంలో అరుణోదయా ఆర్ట్స్ పేరిట నాటకాలు ప్రదర్శిస్తున్నారు. 2000లో మదర్ ఆర్ట్స్ పేరుతో దేశం నలుమూలలా ప్రదర్శనలు ఇచ్చారు. కొత్తపరిమళం, దేవరాగం అనే నాటికలు ఈ నెల 2న తాడేపల్లిగూడెం, విజయవాడలో ప్రదర్శించగా రెండు జ్యూరీ అవార్డులు వరించాయి.

డాక్టర్ కుమార్‌నాయక్



పలాసకు చెందిన డాక్టర్ కుమార్‌నాయక్ విద్యార్థి దశ నుంచే నాటికలు, నాటకాలు ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం సినీ రంగంలో కూడా ప్రతిభను కనబర్చుతున్నారు. త్వరలో విడుదల కానున్న 'పాంచాలి' చిత్రంలో న్యాయవాది పాత్రలో నటిస్తున్నారు.ఈయనకు అవార్డు రావడం పట్ల పలాసలోని వివిధ కళా, సాహితీ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

బెండాళం శోభన్‌బాబు



కంచిలి మండలం కత్తివరం గ్రామానికి చెందిన బెండాళం శోభన్‌బాబు కళారంగంలో విశేషంగా రాణిస్తున్నారు. ఉద్దాన ప్రాంతం బొరివంక కేంద్రంగా ఉన్న శర్వాణి ఫైన్ ఆర్ట్స్ సంస్థ తరఫున ప్రదర్శనలు ఇస్తున్నారు. పౌరాణిక నాటక ప్రదర్శనలో అనేక పాత్రలు పోషించి ఆకట్టుకున్నారు. ఈయనకు కందుకూరి అవార్డు రావడంపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

బల్లెడ చలపతిరావు



కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన బల్లెడ చలపతిరావు వృత్తిరీత్యా వ్యవసాయం, ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తుంటారు. తాతతండ్రుల కాలం నుంచి పౌరాణిక నాటికల్లో ప్రవేశముంది. 27 ఏళ్ల నటనా జీవితంలో భక్త ప్రహ్లాద నాటకంలో వేసిన హిరణ్యకశిపుని పాత్ర ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. బొరివంకలో శార్వాణీ గిరిజన సాంస్కృతి సమాఖ్య అనే నాటక సంస్థ స్థాపించి ప్రదర్శనలు ఇస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- అత్తవారే కారణమంటున్న మృతురాలి బంధువులు
- భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు



భవాని (ఫైల్)

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన బాలబొమ్మ భవానీ(21) అనే వివాహిత మంగళవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలఖండ్యాం గ్రామానికి చెందిన భవానీకి సంతవురిటి గ్రామానికి చెందిన దినేష్‌తో తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. దినేష్ సచివాలయ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్నాళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పాలఖండ్యాంలోని పుట్టింటికి వెళ్లిన భవానీ ఈ నెల 14న సంతవురిటి వచ్చింది. అదే రోజు రాత్రి మళ్లీ దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున 4 గంటల సమయంలో భవానీ సోదరుడు నాగరాజుకు దినేష్ ఫోన్ చేసి భవానీ మృతిచెందినట్లు సమాచారం అందించాడు. సోదరుడు వెళ్లి చూసేసరికి భవానీ విగతజీవిగా కనిపించింది. భవానీ మృతికి అల్లుడు దినేష్, అత్తింటి వారే కారణమని బంధువులు ఆరోపించారు. భవానీ మెడపై గాయాలు ఉండటంతో దినేష్ హత్య చేశాడని ఆరోపిస్తూ మృతురాలి తండ్రి ధారబోయిన రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జె.ఆర్.పురం సీఐ అవతారం, ఇన్‌చార్జి ఎస్‌ఐ లక్ష్మణరావు, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా పూర్తి చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త దినేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అవతారం

రైలు ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ఆమదాలవలస/బూర్జ: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలో వెంగళరావు కాలనీ సమీపంలో అప్‌లైన్ ట్రాక్‌పై మంగళవారం రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం పాలవలస గ్రామానికి చెందిన సురవరపు శ్రీనివాసరావు(42) టాటా ఏస్ వ్యాన్ నడుపుతుంటాడు. ప్రతిరోజూ పాలకొండ నుంచి శ్రీకాకుళం కర్రపొట్టు తరలిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావుకు భార్య భవాని, కుమార్తె స్పందన, కుమారుడు చైతన్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం



తీవ్ర గాయాలతో చిన్నలచ్చయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం ఫ్లై ఓవర్ వంతెన కింద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. విజయనగరం జిల్లా రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగడ చిన్నలచ్చయ్య (74) బస్సులో ప్రయాణిస్తూ చిలకపాలెం వద్ద దిగాడు. లావేరు మండలం బుడుమూరు సంతకు వెళ్లే క్రమంలో ఫ్లై ఓవర్‌ను దాటుతుండగా.. చిలకపాలెం వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో వృద్ధుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులు, ఆర్ట్ టీచర్‌కు షీల్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు బంగారు పతాకాలు, మరో పది మంది విద్యార్థులు వెండి పతకాలు సాధించారు. విజయవాడలో ఈ నెల 5న డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 12వ ఆల్ ఇండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ర్వహించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు కంచిలి గురుకుల విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను పంపించారు. వాటిలో ఎంపిక కావడంతో మంగళవారం ప్రపంచ ఆర్ట్ దినోత్సవం సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేశారు. ప్రతిభ కనబర్చిన మరో 80 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. గురుకుల కళాశాల ఆర్ట్స్ ఉపాధ్యాయుడు దిక్కల మన్మథరావుకు జాతీయ బాల ఉత్తమ చిత్రకళ అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పైల గణపతిరావు, డి.మల్లికార్జునరావు, సూపరింటెండెంట్ గేదెల జయరాం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల సరఫరాకు టెండర్లు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ, వార్డు సచివాలయాలకు, చౌకధరల దుకాణాలకు మండలస్థాయిలో ఉన్న 14 గోదాముల నుంచి నిత్యావసర సరుకులు డోర్ డెలివరీ చేసే కాంట్రాక్టర్ల నియామకానికి ప్రభుత్వం ఈ–టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రెండో దశ రవాణా నిమిత్తం ఈ నియామకాలు చేపట్టనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు గడువు 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీకాకుళం వారి పేరున రూ. 5 వేలు డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించాలన్నారు. అన్ని వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 30 సాయంత్రం 6 గంటలవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గోదాములివే..

జి.సిగడాం, ఆమదాలవలస, జలుమూరు, కొత్తూరు, మెళియాపుట్టి, శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, కోటబొమ్మాళి, పలాస, ఇచ్ఛాపురం, కంచిలి, సరుబుజ్జిలి, లావేరు గోదాముల టెండరుకు సంబంధించి ఈ నెల 16 ఉదయం డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఉంటుందని, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చివరి తేదీ 30 సాయంత్రం 4 గంటలని, బిడ్ దాఖలు చివరి తేదీ 30 సాయంత్రం 4.30, టెక్నికల్ బిడ్ సాయంత్రం 5.30కు తెరుస్తారని తెలిపారు. అర్హత సాధించేవారికి ఆర్థిక బిడ్‌ను వచ్చే నెల 1 ఉదయం 11 గంటలకు తెరుస్తారు. ఇతర వివరాలకై పౌరసరఫరాల మేనేజర్ కార్యాలయం (సహాయ మేనేజర్ సెల్‌నెంబర్) 7732088637 నంబరుకు చేయొచ్చని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన 5–18 ఏళ్లు (31 జూలై, 2025 లోపు)వయస్సు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న బాలలు జూలై 31 తేదీ లోపుగా జ్బిఇ/ప్రేత్రీటఛీట.జ ఐఠి.జీ ఽ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని సూచించారు. ఎంపికైన వారికి వచ్చే ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో ఏపీ ఎస్సీపీసీఆర్ ఆధ్వర్యంలో వీటిపై అవగాహనా కార్యక్రమాలు, సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.